క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ఎస్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కేశవరెడ్డినగర్, పోస్టాఫీసు, సీతాహోమ్స్, టీఎస్ఆర్‌నగర్, డైనమిక్‌కాలనీ, మీర్‌పేట విలేజ్, రాఘవేంద్రకాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

మేయర్ పారిజాత



అల్మాస్‌గూడలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం మేయర్ చిగురింత పారిజాత, డీఈఈ అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

ఆదర్శ డివిజన్‌గా బీఎన్‌రెడ్డి నగర్



వరదనీటి కాల్వ పనులపై ఏఈతో చర్చిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఏఈ నాగరాజుతో కలిసి కాలనీలో వరదనీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వరదనీటి కాలువ ఏర్పాటుతో లోతట్టు కాలనీల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత కాలనీవాసులపై ఉందన్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్‌-1 నూతన కార్యవర్గం ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ సంక్షేమ సంఘం ఫేజ్‌-1 అధ్యక్షుడిగా వెదిరే యోగేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కాలనీ వాసులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సాతినేని రాంరెడ్డి, కోశాధికారిగా నాగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు యోగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పార్కు సమస్యలను పరిష్కరిస్తానని, కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

‘ఉపాధి’ పనుల్లో సమస్యలుంటే తెలపండి

ఇబ్రహీంపట్నం: ఉపాధీ హామీ పనుల్లో ఎలాంటి సమస్యలున్నా తమను సంప్రదించాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీల వేతనాలు, చెల్లింపులు తదితర సమస్యలతోపాటు కొత్తగా జాబ్‌కార్డు కావాలనుకునే కూలీలు, వ్యవసాయ పొలాల్లో ఉపాధి పనులు కావాలనుకునే రైతులు 92814 87190, 92814 87091 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డికి మండలి చైర్మన్ పరామర్శ



పద్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గుత్తా, కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తల్లి పద్మమ్మ(92) ఇటీవల మరణించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామానికి విచ్చేసిన మండలి చైర్మన్ గుత్తా.. పద్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

నివాసం.. మురుగుతో సహవాసం

మండల కేంద్రంలో పలు వార్డుల్లో ఇళ్ల మధ్య వాడుక నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి ఇదే దుస్థితి నెలకొంటుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- దుర్వాసనతో పాటు దోమల బెడద, పందుల సంచారం
- ఇబ్బంది పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కందుకూరు: మురుగు కాల్వల వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా సంబంధిత అధికార యంత్రాంగం కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో నిత్యం మురుగుతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది.



కాలనీలో సంచరిస్తున్న పందులు

18 ఏళ్లు అవుతున్నా..

కందుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కొనుగోలు చేసిన వారు 2005నుంచి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అప్పటి నుంచి ఇళ్లు కట్టుకుని చాలా మంది జీవిస్తున్నారు. కాగా ఇప్పటికి వారికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. మురుగు నీరు బయటికి వెళ్లేలా డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఎవరి ఇంటి ఎదుట వారే గుంతలు తవ్వకుని తాత్కాలికంగా మురుగు నీటిని అందులోకి వదులుతున్నారు. ఏళ్ల తరబడి ఇంకుడు గుంతల్లోకి మురుగు నీరు పంపిస్తుండటంతో ప్రస్తుతం ఆ గుంతలు సైతం నిండి మురుగు బయటికి పారుతున్నాయి. తీవ్ర దుర్వాసనతో పందులు, దోమలు, ఈగలకు ఆవాసంగా మారాయి. మురుగు నీటిలో పందులు విచ్చలవిడిగా తిరుగుతూ పారిశుద్ధ్యం సమస్య తలెత్తేలా ఉంది. మరో పక్క మురుగుతో పాటు ఈగలు, దోమల ఉధృతి ఎక్కువై కంటి మీద కునుకు లేకుండా పోతుందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు నీరు పోయేలా భూగర్భడ్రైనేజ్ నిర్మించడంతో పాటు సీసీ రోడ్లు వేయాలని కోరుతున్నారు.



కందుకూరు పీహెచ్‌సీ సమీపంలో నిండిన మురుగు గుంతలు

ఉండలేక పోతున్నాం

మురగు గుంతలు నిండి మురుగు బయటికి పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతూ ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. మురుగు కారణంగా పందుల సంచారం అధికమైంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– రాంరెడ్డి, కందుకూరు చౌరస్తా

స్పందించడం లేదు

మురుగు నీటితో పాటు వర్షం నీరు పోయే మార్గం లేక చాలా ఇబ్బందిగా ఉంది. మురుగు గుంతలు నిండి తీవ్ర దుర్వాస వెదజల్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు.

– డి.ప్రభాకర్, కందుకూరు చౌరస్తా

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ కొరుపోలు రాఘుమారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని హర్షగూడ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతా నాయక్, సర్పంచ్ పాండు నాయక్, కంటి వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం ఎల్బీనగర్ ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్ హరి కృష్ణయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. డివిజన్‌లో మంజూరైన యూజీడీ పైపులైన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, విజయపురికాలనీ, జేబీకాలనీ, ఇండోర్ స్టేడియం వద్ద నాలా పనులు, లక్ష్మీనగర్, ఎస్‌బీఐకాలనీ, వేంకటేశ్వరకాలనీ, క్రాంతినగర్, శంకర్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లలో కొత్త రోడ్లు, వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కొత్తపేట చౌరస్తాలో అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు, వీధికుక్కల నిర్మూలన చేపట్టాలని కోరారు. దీంతో పాటు మంజూరైన మహిళా భవన్‌లు, కమ్యూనిటీ హాళ్ల పనులను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.



ఈస్ట్‌జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

డిమాండ్లు తీర్చే వరకు పోరాడుతాం



ఆందోళన చేస్తున్న వీఓఏలు

- సీఐటీయూ మండల అధ్యక్షుడు బాల్‌రాజు
- 37వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె

కందుకూరు: వీఓఏల న్యాయమైన డిమాండ్‌లు తీర్చే వరకు పోరాటాన్ని ఆపమని సీఐటీయూ మండల అధ్యక్షుడు బుట్టి బాల్‌రాజు అన్నారు. మండల కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 37 రోజులకు చేరింది. ఈ సందర్భంగా బాల్‌రాజు మాట్లాడుతూ.. వీఓఏలు డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి నెల రోజులకు పైగా అవుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు ఆర్.రజిత, మాధవి, మంగ, పి.రజిత, రాధ, శశికళ, శారద, పావని, రజిని, జయ, సంగీత, మంజుల, పద్మ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

‘ఈస్టర్న్ కాలనీస్’ అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్



కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం తూర్పు 21 కాలనీలకు సంబంధించి ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గుత్తా లక్ష్మణ్‌రెడ్డిలను ఆయా కాలనీలకు చెందిన కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. మంగళవారం రాజప్పనగర్ కాలనీలో జరిగిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి

తుర్కయంజాల్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి అన్నారు. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 78లో అక్రమంగా చేపడుతున్న రెండు నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టామని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను సహించేది లేదన్నారు. వీఆర్ఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం మాకొద్దు

ఇంద్రప్రస్థ కాలనీవాసుల నిరసన

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయ వద్దని కోరుతూ మంగళవారం కాలనీ వాసులు, మహిళలు గేటు కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలోకి వెళుతున్న పట్టణ ప్రణాళికా విభాగం, పారిశుధ్య విభాగం అధికారులను అడ్డుకున్నారు. 2016లో జీహెచ్ఎంసీ వార్డు పునర్విభజనలో భాగంగా ఏర్పడిన హస్తినాపురం డివిజన్‌కు పూర్తిస్థాయి వార్డు కార్యాలయం లేకపోవడంతో ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్‌-2లోని కమ్యూనిటీ హాల్‌పై అంతస్తులో తాత్కాలికంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పాలన కొనసాగిస్తున్నారు. ఇటీవల డివిజన్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా డివిజన్ల పరిధిలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంద్రప్రస్థ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న కార్యాలయాన్నే వార్డు కార్యాలయంగా కొనసాగించాలనే ఉద్దేశంతో అధికారులు సన్నాహాలు చేపట్టారు. దీనిపై సమాచారం అందడంతో కాలనీ వాసులు అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకున్నారు. కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు చేస్తే పండుగలు , శుభ కార్యాలయాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు వార్డు కార్యాలయంలోకి వెళ్లకుండా మహిళలు వారిని అడ్డుకున్నారు. వార్డు కార్యాలయం ఏర్పాటుతో ప్రజలు సమస్యలను పరిష్కరించడంలో సులువు అవుతుందని అధికారులు నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కల్యాణలక్ష్మితో పేదల ఇళ్లలో వెలుగులు

మీర్‌పేట మేయర్ ఎం.దుర్గ

మీర్‌పేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో పేదల ఇంట్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ పరిధిలో 53 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌రావు, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, ఫ్లోర్‌లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పల్లె ఎం.ఎ.. రజాక్, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్నాథరావు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, భారతమ్మ, స్వప్న, సుదర్శన్ రెడ్డి, లలిత, రోహిణి, పి.శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, పవన్, మున్సిపల్ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి



బడంగ్‌పేట్: చెక్కులు పంపిణీ చేస్తున్న పారిజాత, ఇబ్రాం శేఖర్

రైతు రుణమాఫీ చేపట్టాలి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలప్పుడు రూ.లక్షలోపు పంటరుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అరకొరగా రూ.25వేల రుణాల వరకే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతు రుణమాఫీ పూర్తిచేయాలని కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

మేయర్‌ను కలిసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష యాదవ్‌తో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన మనవరాళ్లతో కలిసి మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి మేయర్ డా.శిరీష యాదవ్ ఆహ్వానం మేరకు మంగళవారం ఉదయం మేయర్ నివాసంలో అల్పాహార విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యేను మేయర్ దంపతులు సత్కరించారు.

ఉత్సాహంగా సీఎం కప్



ఖోఖో పోటీలో తలపడుతున్న నందిగామ-గండిపేట క్రీడాకారులు

రెండోరోజు కొనసాగిన క్రీడా పోటీలు

హుడాకాంప్లెక్స్: సీఎం కప్‌-2023లో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం రెండో రోజు ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో మండలాల నుంచి ఎంపికైన 500 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 24న వాలీబాల్ పురుషుల విభాగంలో గండిపేట-ఫారూఖ్‌నగర్, మహిళల విభాగంలో యాచారం -తలకొండపల్లి, కబడ్డీ పురుషుల విభాగంలో సరూర్‌నగర్-బాలాపూర్, ఖోఖో పురుషుల విభాగంలో యాచారం-హయత్‌నగర్, ఖోఖో మహిళా విభాగంలో సరూర్‌నగర్-హయత్‌నగర్ గ్రూపులకు బుధవారం సాయంత్రం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వివిధ మండలాల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు



సీఐటీయూ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న కార్యకర్తలు

చైతన్యపురి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మల్లెపాక వీరయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చైతన్యపురిలోని బోడేపూడి వెంకటేశ్వర భవనంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. మేకల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ శక్తులు కార్మికవర్గ ఐక్యతను పక్కదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మటం, ఎల్ఐసీ, బ్యాంకింగ్ రంగ ఆర్థిక సంస్థలను బలహీన పరుస్తుందని, రైల్వే, బొగ్గు బావులు, టెలికం, విద్యుత్, నేషనల్ హైవేలు, పెట్రోలియం సంస్థల వాటా, ఆస్తులను తాకట్టు పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి చైతన్య, సరూర్‌నగర్ లేబర్ అడ్డా అధ్యక్షుడు సీహెచ్ నవీన్, నాయకులు కే.యశోద, నరసింహ, భిక్షపతి, ఎన్ లింగయ్య, నాగమణి, ఉప్పలమ్మ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధీ హామీ పనులను అధికారులు మంగళవారం పరిశీలించారు. దండుమైలారం, నెర్రపల్లి, ముకునూర్, నాగన్‌పల్లి గ్రామాల్లోని ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దండుమైలారంలో ఇంకుడుగుంతలు తీయడం, నెర్రపల్లిలో గ్రామీణ క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులను పరిశీలించారు. ముకునూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరుపతిచారి, ఏపీడీ సక్రియానాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జగన్, మల్లేశ్వరి, భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ అనసూయ, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాచారం మండలం చౌదర్‌పల్లిలో ఇంకుడుగుంతల తవ్వకం పనులను మంగళవారం సర్పంచ్ నర్సింహారెడ్డి ప్రారంభించారు.



ఇంకుడుగుంతల పనులను పరిశీలిస్తున్న అధికారులు